క్లుప్తంగా

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది : సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలు వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

గీతంలో జాతీయ భద్రతా వారోత్సవాలు



అగ్నిప్రమాద నియంత్రణపై సిబ్బందికి శిక్షణ ఇస్తున్న అధికారులు

కొమ్మాది : రుషికొండలో గల గీతం వర్సిటీలో ఆదివారం జాతీయ భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. ఇక్కడి సెక్యూరిటీ విభాగం సిబ్బందితోపాటు భోజనశాలలు, నర్సింగ్ సేవల విభాగం సిబ్బందికి అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగిన సందర్భంలో, అత్యవసర పరిస్థితుల్లో వ్యవహరించాల్సిన తీరుపై భద్రతా నిపుణుడు ఎస్‌పీబీ రంగాచార్యులు అవగాహన కల్పించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలతో బొడ్డపాలెం గ్రామస్తులు

ఆనందపురం : మండలంలోని గంభీరం పంచాయతీ పరిధిలోని బొడ్డపాలెంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రబోధ సేవా సమితి సభ్యులు ప్రచారం నిర్వహించారు. విజయరాంపురం ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు మాట్లాడుతూ శివలింగంపై ఉన్న మూడు విభూతి రేఖలు, జీవాత్మ, ఆత్మ, పరమాత్మలకు గుర్తులని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు వి.సురేష్, ఎస్.శ్రీనివాస్, కె.సంతోష్, కె.బంగారుతల్లి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

దాకమర్రిలో ఎన్‌ఎస్‌ఎస్ సేవా కార్యక్రమాలు



సచివాలయ వ్యవస్థపై అవగాహన కలిగిస్తున్న విద్యార్థులు

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి రఘు ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పంచాయతీ వాసులకు ఆదివారం పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రోగ్రాం కో ఆర్డినేటర్ బి.ఎస్.వెంకటరెడ్డి ఆధ్వర్యంలో సచివాలయ వ్యవస్థ, పచ్చదనం, వైద్యం, ఓటు గొప్పతనం వివరించి మొక్కలు పంపిణీ చేశారు. గ్రామంలో కొన్ని మొక్కలు నాటారు. బాల్యవివాహాలు వల్ల కలిగే అనర్థాలు వివరించారు. పాలిథిన్, ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలు వివరించి, నియంత్రణకు సహకరించాలని కోరారు.

మహిళా సాధికారతే సీఎం జగన్ లక్ష్యం

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



తాటితూరు కూడలిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి లబ్ధిదారులతో కలిసి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



భీమిలి మండల మహిళలకు వైఎస్సార్ చేయూత పథకం ద్వారా రూ.4.86 కోట్ల చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస : సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు తలెత్తుకుని జీవించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ చేయూత వంటి 33 పథకాలలో 99 శాతం సంక్షేమ పథకాలు అమలు చేశారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం సాయంత్రం భీమిలి మండలం తాటితూరు కూడలిలో 16 పంచాయతీలకు చెందిన 2,593 మంది లబ్ధిదారులకు రూ.4.86 కోట్ల వైఎస్సార్ చేయూత చెక్కు, అలాగే మండల పరిధిలో మహిళలకు రిజిస్ట్రేషన్ చేసిన ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి ప్రజాప్రతినిధులు, అధికారులు, వీవోఏలను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా సగం రాజకీయ పదవులు మహిళలకు కేటాయించి గౌరవించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు. ప్రపంచాన్ని శాసించే పవర్ మహిళలకు ఉందన్నారు. సీఎం జగన్‌పై పోటీ చేయడానికి టీడీపీ మూడు పార్టీలను కాకుండా 33 పార్టీలను తెచ్చుకున్నా భయం లేదన్నారు. సంక్షేమ పథకాలు అందుకుంటున్న మహిళల్లో 60 శాతం ఓట్లు వేస్తేనే వైఎస్సార్‌సీపీ 120 సీట్లు గెలుచుకుంటుందన్నారు. అలాంటిది అందరూ వేస్తే 175 సీట్లు గెలుచుకుంటామన్నారు. టీడీపీ హయాంలో ఎమ్మెల్యేకు సమస్యలు చెప్పుకుందామన్నా దర్శనం లభించేది కాదన్నారు. జన్మభూమి కమిటీల అవినీతి, లంచగొండితనం, వివక్షకు తావు లేకుండా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో తనతోపాటు ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మికి కలిపి రెండు ఓట్లు వేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో జానకి, వ్యవసాయశాఖ సలహా మండలి జిల్లా చైర్మన్ దాట్ల పెదబాబు, ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, ఎంపీపీ దంతులూరి వాసురాజు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, మండల సచివాలయాల కన్వీనర్ సరగడ రఘునాథరెడ్డి, యూత్ అధ్యక్షుడు చిల్ల హరి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు శిరిగుడి ఈశ్వరరావు, ఉండబట్ల ఆదిలక్ష్మి, ముద్దాడ అప్పయ్యమ్మ, మజ్జి సూరినాయుడు, సమ్మిడి శ్రీనివాసరావు, చెల్లూరి నగేష్, పోట్నూరు చంద్రశేఖర్, పల్లా సన్యాసిరావు, కొల్లి కోటిరెడ్డి, దుంపల ప్రభాకర్, రవ్వ ఈశ్వరరావు, వెంపాడ సూరిబాబు, కొయ్య రమేష్‌రెడ్డి, బొడ్డు దుర్గారావు, మేరుగు ఎల్లాజీ, ముద్దాడ సూరప్పడు, భాగం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ఆనందపురం : మహిళలు స్వశక్తితో అన్ని రంగాల్లో రాణించాలనే ధ్యేయంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వెల్లంకిలో ఆదివారం వైఎస్సార్ చేయూత పథకం నాలుగో విడత కింద 4,678 మంది మహిళలకు మంజూరైన రూ.8,77,12,500 మెగా చెక్కు అందజేశారు. గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన రోడ్డు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు శక్తివంతులు, విద్యావంతులైతే సమాజంలో సమూల మార్పులు వచ్చి అభివృద్ధి సాధ్యపడుతుందని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నారని, అందుకే అన్ని సంక్షేమ పథకాలు మహిళల పేరిటే అమలు జరుపుతున్నారని చెప్పారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయని విధంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిదేనని కొనియాడారు. గతంలో చంద్రబాబు నాయుడు రుణమాఫీ, సున్నావడ్డీ అంటూ మహిళలను మోసం చేశారని చెప్పారు. అందుకే చంద్రబాబుని ప్రజలు ఘోరంగా తిరస్కరించారని, మరలా ఎన్నికలు వస్తున్న తరుణంలో టీడీపీ, జనసేన, మరికొన్ని పార్టీలు కలిసి వస్తున్నాయని... వారి కల్లబొల్లి మాటలు నమ్మొద్దన్నారు. రాష్ట్రంలో 99 శాతం మందికి మేలు జరిగిందని, ఈ విషయాన్ని ప్రజల దృష్టికి తీసుకెళ్లి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేయడానికి మహిళలు కంకణం కట్టుకోవాలన్నారు. రాష్ట్రం బాగుపడాలన్నా, సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా మరలా వైఎస్సార్‌సీపీనే గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, మజ్జి వెంకటరావు, సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, వైస్ ఎంపీపీలు పాండ్రంకి శ్రీను, బొట్టా ధనలక్ష్మి, నాయకులు బంటుబిల్లి మణిశంకర నాయుడు, కాకర వెంకట రమణ, చెన్నా సత్యం, పడాల రాము, కె.చంద్రమౌళి, మరుపిళ్ల చిన్నయ్య పాత్రుడు, కూరాకుల వెంకటేష్, డోల దేవుడు, కోన శ్రీను, బీఆర్‌బీ నాయుడు, గంట్రెడ్డి శ్రీనివాస్, కోరాడ అప్పలస్వామి నాయుడు, లెంక రాంబాబు, షిణగం అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

'చేయూత'తో దుస్తుల విక్రయం



సీఎం జగన్ ప్రభుత్వం నాకు 'వైఎస్సార్ చేయూత' ద్వారా నాలుగు విడతలుగా రూ.75వేలు అందించింది. మా పిల్లలకు జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా ద్వారా మొత్తం రూ.2 లక్షలకు పైగా సంక్షేమ పథకాలు అందాయి. వీటి నుంచి రూ.లక్షతో దుస్తుల వ్యాపారం మొదలు పెట్టాను. నెలకు రూ.3 వేల నుంచి రూ.5 వేల ఆదాయం లభిస్తోంది.

– మజ్జి మంగతల్లి, టి.నగరపాలెం



వెల్లంకిలో సిమెంట్ రోడ్డు శిలాఫలకం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి, నాయకులు



సీఎం వైఎస్ జగన్‌కు జేజేలు పలుకుతున్న మహిళలు



తాటితూరులో పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



వెల్లంకిలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, మహిళలు

మహిళా సంక్షేమానికి సీఎం జగన్ పెద్దపీట



ఎస్‌వోఎస్‌లో మహిళలతో బొత్స ఝాన్సీ లక్ష్మి

తగరపువలస : రాష్ట్రంలో మహిళా సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పెద్దపీట వేసి సంక్షేమ పథకాల లబ్ధిని వారి బ్యాంకు ఖాతాల్లోనే జమ చేస్తున్నారని మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ సమన్వయకర్త బొత్స ఝాన్సీ లక్ష్మి అన్నారు. భీమిలి ఎస్‌వోఎస్‌లో ఆదివారం నిర్వహించిన మహిళ దినోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. మహిళల సహనం, గొప్పతనంతోనే భారతదేశానికి గుర్తింపు లభించిందన్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలు వెనుకబడి ఉండకుండా ప్రతి ఒక్కరూ చదువుకోవాలన్నారు. తనకు విశాఖ పుట్టినిల్లు అయితే విజయనగరం మెట్టినిల్లు అన్నారు. విశాఖను పరిపాలన రాజధానిగా చేయాలన్న సీఎం వైఎస్ జగన్ సంకల్పాన్ని ఉత్తరాంధ్ర ప్రజలు బలపరుస్తూ మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కోరారు. తనను విశాఖ ప్రజలు ఆదరిస్తుండటం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా బ్యాగులు, పుస్తకాలు పంపిణీ చేశారు. వితంతువులు, పేద మహిళలకు ఎస్‌వోఎస్ అండగా నిలవడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఏపీ బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారాం, ఎస్‌వోఎస్ డైరెక్టర్ రవీంద్ర, ప్రతినిధి దుర్గరాజు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఉత్తరాలు పంపిణీ



ఉత్తరాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: ఐదేళ్లల్లో జరిగిన అభివృద్ధికి సంబంధించి సీఎం జగన్ పేరిట ముద్రించిన ఉత్తరాలను ఎంపీపీ కంటుబోతు రాంబాబు పంపిణీ చేశారు. మండలంలోని మద్దిలో గ్రామంలో పలు క్లస్టర్లలో ఆదివారం ఉత్తరాలు అందజేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు.

సావిత్రి బాయి పూలే ఆశయాలు కొనసాగిద్దాం



మధురవాడలో సావిత్రి బాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మధురవాడ : సంఘ సంస్కర్త, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పనిచేసిన సావిత్రి బాయి పూలే ఆశయాలు ముందుకు తీసుకెళ్లడమే ఆమెకిచ్చే నిజమైన నివాళి అని పలువురు సీఐటీయూ, ఐద్వా నాయకులు అన్నారు. ఆదివారం సాయంత్రం మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద పూలే 127వ వర్ధంతిని సీఐటీయూ, ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మధురవాడ జోన్ అధ్యక్షురాలు కొండమ్మ, ఐద్వా అధ్యక్షురాలు సుజాత, నగర నాయకులు కె.కుమారి మాట్లాడుతూ మహిళలే అన్ని రంగాల అభివృద్ధికి మూల కారకులన్నారు.

అయినా అన్నిచోట్లా వివక్ష కొనసాగుతోందన్నారు. రాజకీయాల్లో మరింత స్వతంత్రంగా ఎదగాలన్నారు. మరిన్ని హక్కులు, అవకాశాల కోసం పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు వరలక్ష్మి, కె.పద్మ, సీతా భవానీ, విజయ, కె.గంగమ్మ, డి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమంపై ఇంటింటా ప్రచారం



సంతపేటలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



వలందపేటలో ప్రచారం చేస్తున్న నాయకులు



రాజవీధిలో ప్రచారం చేస్తున్న నాయకులు

తగరపువలస : జీవీఎంసీ 1, 2 వార్డుల్లో వైఎస్సార్ సీపీ బూత్ కమిటీల ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గత ఐదేళ్లలో గ్రామాల్లో జరిగిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలపై కరపత్రాలు ద్వారా అవగాహన కల్పించారు. టీడీపీ హయాంతో పోలిస్తే ప్రస్తుతం జరిగిన అభివృద్ధిని, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపించుకుని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిగా చేసుకోవడం వల్ల కలిగే మేలును వివరించారు. భీమిలి మండలం రేఖవాని పాలెంలో సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. సంతపేటలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, చిల్ల ప్రమీల, జగన్నాథ ఎల్లాజీ, సరగడ నాగిరెడ్డి పాల్గొన్నారు. వలందపేటలో చిల్ల సూర్యనారాయణరెడ్డి, రాజవీధిలో కొప్పల రమేష్, తమ్మిన నరసింగరావు, లెంక రమేష్, గిడుతూరి మురళి పాల్గొన్నారు. ఆదర్శనగర్‌లో చేట్ల శ్రీనివాసరెడ్డి, సరగడ నాగిరెడ్డి, మద్ది మహాలక్ష్మి, చేట్ల నరసింగ్‌రెడ్డి, జీరు పద్మ, దుర్రి రామయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



రెడ్డిపల్లిలో లబ్ధిదారుకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



రామాలయ పునర్నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

పద్మనాభం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. 'పేదలందరికీ జగనన్న ఇళ్లు' పథకంలో భాగంగా మండలంలోని రెడ్డిపల్లిలో ఆదివారం రాత్రి తునివలస, పొట్నూరు, కృష్ణాపురం, రెడ్డిపల్లి గ్రామాలకు చెందిన 460 మందికి రిజిస్ట్రేషన్ చేసిన ఇంటి స్థలాల శాశ్వత భూహక్కు పత్రాలను ఆయన పంపిణీ చేశారు. సీజీఎఫ్ నిధులు రూ.1.20 కోట్లతో పురాతన రామాలయ పునః నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి రెండు కళ్లు వంటివన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను లంచాలు లేని రాష్ట్రంగా సీఎం జగన్ మోహన్ రెడ్డి తీర్చిదిద్దారన్నారు. గృహ సారథులు, కన్వీనర్లు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి భీమునిపట్నం నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, అందించిన సంక్షేమ పథకాలతో కూడిన కరపత్రాలు, సీఎం లేఖలను అందజేయాలన్నారు. సినిమా షూటింగ్ పార్టీ జనసేన, గతంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నేవవేర్చని చంద్రబాబు మాయ మాటల ఉచ్చులో పడి మోసపోవద్దన్నారు. పద్మనాభం కన్నయ్య కొనేరు నుంచి రెడ్డిపల్లి శాంతినికేతన్ వరకు చేపట్టే రోడ్డు విస్తరణ పనులను కాంట్రాక్టర్ టీడీపీకి చెందిన వ్యక్తి కావడంతో తాత్సారం చేస్తున్నాడని ఆరోపించారు. అయినప్పటికీ రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు కృతనిశ్చయంతో వున్నామన్నారు. రామాలయం లేని ఊరు ఊరే కాదన్నారు. ప్రతి గ్రామంలోనూ రామాలయం ఉండాలన్న సదుద్దేశంతో రెడ్డిపల్లి పురాతన రామాలయ పునః నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, వైస్ ఎంపీపీ ఈర్ల రాజేశ్వరి, వ్యవసాయ సలహా మండలి జిల్లా అధ్యక్షుడు దాట్ల పెదబాబు, తహసీల్దార్ ఎస్.వెంకటరావు, ఎంపీడీవో బి.శైలజ, వైఎస్సార్ సీపీ నాయకులు సిరుగుడి ఆదినారాయణ, సుంకర బంగారప్పడు, ఈర్ల ఈశ్వరరావు, ఎస్‌పీఎస్ బాబు, మొకర అప్పలనాయుడు, సుంకర నారాయణరావు, గాడు అప్పలరాజు, రెడ్డిపల్లి రామాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రెడ్డిపల్లి శ్యామ సుందర్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



నిర్వాహకుల నుంచి జ్ఞాపిక అందుకుంటున్న సాత్విక

పీఎం పాలెం : వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. నగరానికి చెందిన శ్రీ సాయి నాట్య కళాభారతి అకాడమీలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు అపురూప నృత్యంతో ఆద్యంతం ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కళాకారులు తనూజ, ఎం.సాత్విక, ప్రణికశ్రీ, హరిణి, తపస్విని, వేద, జస్విత, కావ్య, సత్య, గునశ్రీ, రమ్యశ్రీ, శ్రీవిద్య నృత్యం చేశారు. స్థానిక పరిపాలన అధికారి టి.విశ్వనాథరెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

నిరుపయోగంగా చంద్రంపాలెం పాఠశాల పాత భవనం

సామాజిక అవసరాల కోసం కేటాయించాలని వినతి



నిరుపయోగంగా ఉన్న చంద్రంపాలెం పాఠశాల పాత భవనం

మధురవాడ : జీవీఎంసీ 7వ వార్డు చంద్రంపాలెం వద్ద జాతీయ రహదారిని ఆనుకుని కోట్లాది రూపాయల విలువైన స్థలంలో ఉన్న భవనం నిరుపయోగంగా దర్శనమిస్తోంది. ఇక్కడ పాఠశాల కోసం స్థానిక పెద్దలు ఇచ్చిన స్థలంలో 1957లో భవనాన్ని ప్రభుత్వం నిర్మించింది. హైవే విస్తరణలో భవనం కొంత భాగం పోయింది. దీంతో ఇక్కడ పాఠశాల నడపలేని స్థితి ఎదురైంది. స్థానికుల వినతిపై ఈ పాఠశాలను పదేళ్ల క్రితం ఎన్‌జీజీవోస్ కాలనీలోకి మార్పు చేశారు. తర్వాత ఎంఆర్‌సీ భవనానికి కేటాయించారు. ప్రభుత్వం ప్రతి మండలానికి 2 ఎంఈవో పోస్టులు మంజూరు చేయడంతో ఎంఆర్‌సీ భవనం కాస్త మండల విద్యాశాఖ భవనంగా మారింది. ఇక్కడ కనీసం మరుగుదొడ్లు కూడా లేకపోవడంతోపాటు భవనం శిథిల స్థితికి చేరిపోవడంతో ఎంఈవో భవనాన్ని రుషికొండ సమీపంలోకి గత ఏడాది తరలించేశారు. అప్పటి నుంచి ఈ భవనం ఖాళీగా దర్శనమిస్తోంది. ఇంత విలువైన ప్రదేశంలో ఉన్న భవనాన్ని నిరుపయోగంగా వదిలేయకుండా సామాజిక అవసరాల కోసం కేటాయించాలని స్థానికులు కోరుతున్నారు.

48 మంది యువకుల రక్తదానం



రక్తదాతలకు సర్టిఫికెట్లు అందిస్తున్న సమితి ప్రతినిధులు

తగరపువలస : చిట్టివలస సత్యసాయి సేవా సమితి వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఎస్‌జీ ఫౌండేషన్ ఫస్ట్ బ్లడ్ బ్యాంకుచే నిర్వహించిన రక్తదాన శిబిరంలో 48 మంది యువకులు రక్తదానం చేశారు. తలసేమియా, గుండె సంబంధిత బాధితులు, క్యాన్సర్ రోగులకు రక్త సేకరణ కోసం ఈ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరం ద్వారా 75 సార్లు రక్తదానం చేసిన రాజు అనే యువకునికి సమితి సభ్యుడు జీఆర్ ఉమ రూ.5వేలు అందించారు. రక్తదాతలు అందరికీ రూ.2 లక్షల వరకు బీమా సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో సమితి పూర్వ కన్వీనర్ ఆర్.చంద్రరావు, జోన్ – 1 కో ఆర్డినేటర్ సత్యసాయి, జిల్లా స్టడీ సర్కిల్ ఇన్‌చార్జి రవిప్రసాద్, ఆధ్యాత్మిక సమన్వయకర్త టీవీఆర్ బాబా, సేవాదళ్ కో ఆర్డినేటర్ సంతోష్, యూత్ కో ఆర్డినేటర్ దివాకర్ లీల, బాలవికాస్ కో ఆర్డినేటర్ త్రివేణి, సమితి కన్వీనర్ జి.సత్యనారాయణ, ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దళాయి శివ, ఫస్ట్ బ్లాక్ అధినేత శ్రీనివాస మహేష్ పాల్గొన్నారు.

దొంగతనాల నివారణపై ప్రచారం



స్టిక్కర్ అంటిస్తున్న ఎస్‌ఐ సూర్యప్రకాష్

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ తగరపువలస ప్రైవేట్ మార్కెట్ పరిసరాల్లో దొంగతనాల నివారణపై క్రైం ఎస్‌ఐ సూర్యప్రకాష్ ఆదివారం అవగాహన కల్పించారు. రద్దీగా వుండే ప్రాంతాల్లో జేబు దొంగల నుంచి రక్షించుకునే విధంగా హెచ్చరిక స్టిక్కర్లు అంటించారు. బ్యాగుల కటింగ్, ఆభరణాలు కాజేసే వారి పట్ల అప్రమత్తంగా వుండాలని సూచించారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్ఠింపజేసి 108 స్వర్ణ సంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు.